# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పారదర్శక బదిలీలు చేయడం అభినందనీయం



తిరుపతి, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త): తిరుపతి జిల్లాలో కౌన్సి లింగ్‌తో పోలీసు సిబ్బందికి పారదర్శక బదిలీలు జరిగాయి. 393మందికి ఎంచుకున్న స్టేషన్‌లకు బదిలీ చేశారు. పోలీసులు సంతోష విధులు చేసేలా చూడటానికి సహకరించిన జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజును పోలీసు అధికారుల సంఘం నాయకులు సోమశేఖరరెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉగ్రదాడిలో బలి అయిన భారతీయులకు నివాళులు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త కాశ్మీర్ పహల్‌గావ్ సంఘటనలో ప్రాణాలు వదలిని బారతీయులకు శ్రీకాళహస్తిలోని వాడవాడల్లో నివాళులర్పించారు. గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్వితీయ శ్రేణి నాయకులు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశాలతో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చెంచయ్యనాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో అమాయకులైన వారి బలి అయ్యారన్నారు. ఈ దాడిలో గాయపడి ప్రాణాలు కొల్పొన వారు త్వరగా కోలుకోవాలని కోరారు. దేశ భద్రత కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పిస్తున్న దేశ జవానులను వారి త్యాగాలను మరువరానిదన్నారు. కాగా సిపిఎం నాయకులు షరీఫ్ సారథ్యంలో నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడిని ఖండించారు.

# ఏమి కష్టమొచ్చింది తల్లీ...?

### ఉరేసుకొని మహిళా కానిస్టేబుల్ మృతి -పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు
### రెండేళ్ళకే తల్లిని కోల్పోయిన బాలుడు



లక్ష్మీ (ఫైల్ ఫోటో)

చౌడేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త సాయం సంధ్యవేళ ఆటపాటలతో అందరూ సంతోషంగా వున్న సమయమది...నిముషంలోనే ఒక్కసారిగా కాలనీ అంతా నిశ్శబ్దం రాజ్య మేలిందింది... ఇంట్లో నుంచి అమ్మా చనిపోయావే ఏమి కష్టమొచ్చిందంటూ కుటుంబ సభ్యుల రోదనతో దద్దరిల్లింది...వెంటనే వెళ్ళి చూడగా గదిలోని ఫ్యానుకు చీరతో మహిళా కానిస్టేబుల్ ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందింది...ప్రేమించి పెళ్ళి చేసుకొన్న భర్తతో సుఖ సంతోషాలతో వుండి వారికి ప్రేమకు గుర్తుగా రెండేళ్ళ బాలుడు జన్మించాడు. బొమ్మరిల్లు లాంటి సంసారంపై ఎవరి కన్ను పడిందో కానీ సమాజానికి బాసటగా వుండే ఉద్యోగాన్ని నిర్వర్తిస్తూ బలవన్మరణం చెందింది... పోలీసుల కథనం మేరకు... మండలంలోని చౌడేపల్లి పరిధిలోగల గోసలకురపల్లికి చెందిన లక్ష్మీ(33) కుప్పం నియోజకవర్గం గుడిపల్లిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈక్రమంలో ఆమె భర్త హరీష్ ఈనెల 23న రాత్రి పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. ఇంట్లో అందరూ భోజనం చేస్తుండగా తన సోదరి కుమార్తె విషయంలో కొద్దిపాటి గొడవ జరిగింది. వెంటనే లక్ష్మీ తనగదిలోకి వెళ్ళి అనుమానాస్పదంగా ఉరేసుకొంది. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మీ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకొన్న వెంటనే పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చిన్నతనం నుంచి పేదరికాన్ని జయించాలన్న కసితో చదివి పోలీసు ఉద్యోగాన్ని దక్కించుకొన్న లక్ష్మీ కుటుంబానికి వెన్నెముకలా నిలచింది. 11సంవత్సరాల పాటు పోలీసు వృత్తిలో అందరి మన్నలను పొందింది.

తండ్రి, తమ్ముని కోల్పోయిన ఆ కుటుంబానికి అండదండగా వున్న ఆ కుటుంబంలో లక్ష్మీ మృతి తీరని లోటని గ్రామస్తులంటున్నారు. మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో జరిగింది.

# "హై అలర్ట్ "!

### దేగకళ్ళతో కాపలాగా పోలీసులు
### -తిరుమల ఘాట్‌లో ఆకస్మిక తనిఖీలు





తిరుమల ,ఏప్రిల్ 24(ప్రభాతవార్తప్రతినిధి: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడితో ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల, తిరుపతిలో కేంద్ర నిఘావర్గాలు హైఅలర్ట్ ప్రకటించారు. దీంతో ఉన్న ఫళంగా బుధ వారం అర్ధరాత్రి నుండి తిరుపతి, తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రంతో బాటు తిరుమల రెండు, మొదటిఘాట్‌రోడ్లులో పలుచోట్ల, లింకు రోడ్డు వద్ద తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్దన్‌రాజు నేతృత్వంలో అడిషనల్ ఎస్పీలు రవిమనోహరచారి. వెంకట్రావు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్ ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్రల పర్యవేక్ష ణలో పోలీసులు నిశితంగా భక్తులను తనిఖీ చేస్తున్నారు. ఆక్టోపస్ బలగాలు, పోలీసులు ఒక్కసారిగా రోడ్లపైకి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. తెల్లవారు జామున నుండి గురువారం రాత్రి వరకు ఈ తనిఖీలు కొన సాగా యి. తిరుమల, తిరుపతిలో పోలీసు అధికారులు హైఅలర్ట్ ప్రకటించి ఎక్కడికక్కడ, ఎప్పటి కప్పుడు పోలీసులు తనిఖీల్లో నిమగ్న మయ్యారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడంతోబాటు ఘాట్‌రోడ్లలో మధ్యలోనూ వాహనాల తనిఖీ జరగడం మరింతగా అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా, అనుమానితులను విచారణ చేసిన తరువాతే పంపాలని కూడా పోలీసు ఉన్నతాధికారులనుండి స్పష్టమైన ఆదేశాలందాయి.

**-తిరుమలలో అత్యవసరంగా సిసికెమెరాలు**

కాశ్మీర్‌పహల్గామ్‌లో ఉగ్రదాడులతో ఏడుకొండలపై భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో బాగంగా రింగురోడ్డు పరిసరాల్లో అత్యవసరంగా సిసికెమెరాలు అమర్చుతున్నారు.

### జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు
# రూ.6 కోట్లు విడుదల

### తడ బిసి హాస్టల్లో సమస్యలు తెలుసుకున్న కలెక్టర్



తడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త తిరుపతి జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉన్న పేద పిల్లల కోసం వారికి అన్ని విధాలా మౌలిక వసతులు కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన తడలోని బిసి హాస్టల్‌ను సందర్శించారు. ఇక్కడి సమస్యలను నేరుగా చూసి పలు అంశాలపై హాస్టల్ వార్డెన్, సిబ్బందిని నిలదీశారు. అనంతరం మాట్లాడుతూ మేజర్ మరియు మైనర్ రిపేర్లకు రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, గత నెల సిఎస్ఆర్, డిఎంఎస్, ఎంపి ల్యాడ్స్ నిధులను రూ.25 కోట్లు అదనంగా సమకూర్చి మంజూరు చేశామని చెప్పారు. వేసవి సెలవులు పూర్తయి పిల్లలు మళ్లీ తిరిగి హాస్టళ్లకు వచ్చేసరికి ఈ పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లకు ఆదేశాలిచ్చామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టల్‌లో కూడా కనీస సౌకర్యాలైన టాయిలెట్లు, ఆర్ఓ డ్రింకింగ్ వాటర్, ఫ్యాన్లు, లైట్లు, దోమలు రాకుండా అన్ని తలుపులకు, కిటికీలకు మెష్‌లను కవర్ చేయడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. జిల్లాలోని చాలా హాస్టళ్లు పాతబడటంతో గోడలు పెచ్చులూడి పడిపోయే పరిస్థితుల్లో ఉన్న కారణంగా మరమ్మతులు చేయాల్సి ఉందని, కిచెన్ కూడా ఇంకా పరిశుభ్రంగా సౌకర్యాలతో ఉండేలా ప్రణాళికలు చేయడం జరిగిందని చెప్పారు.

**పరిసరాల పరిశుభ్రత ఇలాగేనా..!**

హాస్టల్‌లో పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ సంబంధిత వార్డెన్ రవికుమార్‌ను, సిబ్బందిని ప్రశ్నించారు. మరుగుదొడ్లతో సహా విద్యుత్ స్విచ్‌బోర్డులు, మంచినీటి కుళాయిలు వంటివి నేరుగా చూసి ఈ సమస్యలు ఎందుకు పరిష్కరించుకోలేదని ప్రశ్నించారు. అంచనాలు వేసి ఉన్నతాధికారులకు పంపాలి కదా అని కలెక్టర్ అనడంతో సంబంధిత అధికారి ఒకరు పంపించేశాము అని చెప్పడం కలెక్టర్‌కు నచ్చలేదు. అబద్ధాలు మాని ఇప్పటికైనా అంచనాలు వేసి త్వరగా పంపించి పనులు జరిపించుకోవాలని ఆయన సూచించారు.

# కుప్పంలో జోరందుకున్న 'మున్సిపల్' రాజకీయం

### - క్యాంప్‌లకు తరలిన కౌన్సిలర్లు..? చైర్మన్ పదవికై నువ్వా..నేనా..?

కుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవి రాజకీయం జోరందుకుంది. ఈనెల 28వతేది మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఓ పక్క అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంటే మరో పక్క అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు వ్యూహాలు, మంతనాలతో బిజీగా మారిపోయారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు అధికార తెలుగుదేశం పార్టీ తరపున ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు రంగంలో దిగారని సమాచారం. మరో పక్క ప్రతిపక్ష వైఎస్సార్సీ కౌన్సిలర్లు చేజారకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. వైఎస్సార్సీకి చెందిన పలువురు కౌన్సిలర్లను ఇప్పటికే ప్రత్యేక క్యాంప్‌కు తరలించారని సమాచారం. మరికొందరు కౌన్సిలర్లు స్థానికంగానే ఉన్నా ఎవరికీ అందుబాటులో రావడం లేదని తెలిసింది. కాగా అధికార తెలుగుదేశం పార్టీ తరపున ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి కీలకంగా, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఓపక్క పార్టీలో కౌన్సిలర్లుగా ఉంటూ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారితో మంతనాలు జరుపుతున్నారు. మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు మరో ఇద్దరు లేదా ముగ్గురు వైఎస్సార్సీ కౌన్సిలర్ల అవసరం ఉన్న నేపథ్యంలో వైఎస్సార్సీ కౌన్సిలర్లను టచ్‌లో తెచ్చుకునేందుకు జోరుగా దేశం నేతలు మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది.




కుప్పం మున్సిపల్ కార్యాలయం

**కౌన్సిలర్లకు నోటీసులు అందజేత :**

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులకు నోటీసులు ఇదివరకే అందజేసినట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. నోటీసులను కౌన్సిలర్లకు అందించి వారినుంచి అక్నాలెడ్జ్‌మెంట్లు తీసుకుని ఎన్నికల కమీషన్‌కు సైతం పంపినట్లు ఆయన తెలిపారు.

### తాతా ఆలయంలో అనధికారిక ట్రస్టు ముసుగులో
# ఆక్రమాల జోరు..!

### పేదలకు అందని సాయం-లక్షల ఆదాయానికి గండి సమాచారం హక్కుచట్టం ద్వారా జడ్పీటీసీ ఫిర్యాదు



నారాయణవనం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : సత్యవేడు నియోజకవర్గ ం నారాయణవనం మండలకేంద్రంలో అవదూతగా వెలసిన తాతా సొరకాయులస్వామి ఆలయంలో దేవుని పేరుతో అనాధికారిక ట్రస్టును నిర్వహస్తు లక్షల రూపాయాలను దోచుకుంటున్న వైనాన్ని ప్రశ్నిస్తు సమాచార హక్కు చట్టం ద్వారా జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ గురువారం ఫిర్యాదు చేశారు. నారాయణవనంలో ఎంతో ప్రసిద్ది చెందిన తాతా సొరకాయులస్వామిని స్థానికులతో పాటు ఎపి, తమిళనాడు రాష్ట్రం నుంచి ప్రతి నెల పౌర్ణమి, అమావాస్య రోజుల్లో వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. అయితే స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులు, దాతల నుంచి ప్రస్తుతం అనాధికారిక ట్రస్టును నిర్వహిస్తున్న వ్యక్తులు లక్షల రూపాయాలను తీసుకొని అందిన కాడికి దోచుకుంటున్నట్టు మండిపడ్డారు. భక్తుల విరాళాలు ద్వారా నిర్మించిన కల్యాణ మండపానికి 25నుంచి30వేల రూపాయాలకు పెళ్లిలకు అద్దెకు ఇస్తున్నారని, అలాగే ఆలయంకు సంబందించిన మరో 10 రూములను ఎసి, నాన్ ఎసి పేరుతో రోజు వారి అద్దెకు ఇచ్చి వేల రూపాయాలు వసూళ్ల చేస్తున్నారు. అలాగే నారాయణవనం మేజర్ పంచాయతీ నుంచి అప్రూవల్ తీసుకోకుండానే మరో మూడు అంతస్తుల కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. అలాగే వాటర్ ఫ్లాంటును నడుపుతున్నారు. వీటికి కనీసం పంచాయతీకి పైసా పన్ను చెల్లించడం లేదు. అలాగే ప్రతి ఏడాది అడిటింగ్, రిజిస్ట్రేషన్ లేకుండానే ట్రస్టును ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. ఇకపోతే భక్తులకు ఉచితంగా అందించే అన్నదానంలోను తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్టు గుర్తు చేశారు. 2013వ సంవత్సరంలో ఏర్పాటు చేసే సమయంలో ప్రతి నెల 5వతేది హుండీ లెక్కింపును భక్తుల సమక్షంలో నిర్వహిస్తామని, అలాగే రెండేళ్లకోసారి కమిటీ మార్పు, బహిరంగ ఆడిటింగ్ అని చెప్పిన ఆచరణలో అమలు చేయడం లేదు. అధికారులు వెంటనే స్పందించి సమాచార హక్కు చట్టం అడిగిన ప్రశ్నలకు వారంరోజుల్లో తెలియజేయాలన్నారు. ప్రతి ఏడాది పక్కగా ఆడిటింగ్ నిర్వహిస్తున్నామని, అలాగే తాతా సొరకాయుల స్వామి ఆలయ అనాధికారిక ట్రస్టు సభ్యులు బహిరంగ విచారణకు సిద్ధమా? అని ప్రశ్నించారు, అనంతరం ఇన్‌చార్జీ ఎం పిడిఓ గుణశేఖర్, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, పంచాయతీ ఇఓ కెపి షణ్ముగంలకు ఆర్‌టిఐ ద్వారా ఫిర్యాదు చేసిన నకలును అందించారు. కెజి లక్ష్మణన్, మొహిద్దీన్, కె సుధాబాబు, ఆర్ మోహన్, కెఎస్ రవిరెడ్డి, సొరకాయులుమొదలి, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలోనే అత్యధిక వసూళ్ళల్లో
# తిరుపతి జిల్లా మూడవ స్థానం

**- తిరుపతి జిల్లాలోని 774 గ్రామ పంచాయితీల్లో**
**- 2024-2025 ఆర్థిక సంవత్సరానికి**
**రూ. 53.01 కోట్ల డిమాండ్‌కు రూ.44.21 కోట్లు వసూళ్ళు**




డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతులు మీదుగా అవార్డును అందుకుంటున్న తిరుపతి జిల్లా గ్రామ పంచాయితీ అధికారిని సుశీల దేవి

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ఏపీ డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతులు మీదుగా తిరుపతి జిల్లా గ్రామ పంచాయితీ అధికారిని సుశీల దేవి అవార్డును అందుకున్నారు. జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం ఏప్రిల్ 24 పురస్కరించుకుని మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. తిరుపతి జిల్లాలోని 774 గ్రామ పంచాయితీలలో 2024-2025 ఆర్థిక సంవత్సరమును గాను ఇంటి పన్నులు, పన్నేతరముల వసూళ్ళకు సంబంధించి మొత్తం డిమాండ్ రూ.53.01 కోట్లుకు ఉండగా, అందులో రూ. 44.21 కోట్లు అనగా 83 శాతం వసూళ్ళు కాబడి రాష్ట్రంలోనే మూడవ స్థానంలో అత్యధిక వసూళ్ళు సాధించినందుకుగాను ఆమెకు ఈ అవార్డు లభించింది.

### రేషన్ షాపులలో
# మాయమవుతున్న బియ్యం



పూతలపట్టు, ఏఫ్రిల్ 24, ప్రభాతవార్త పూతలపట్టు మండలంలో 44 రేషన్ షాపు ఉండగా పూతలపట్టు రేషన్ షాపు నందు సుమారు 200 నుంచి 250 మంది లబ్ధిదారులకు బియ్యం కొరత ఏర్పడుతున్నది. అంతేకాకుండా కమ్మ గుట్టపల్లి రేషన్ షాపు నందు 36 బస్తాలు పి. కొత్తకోట రేషన్ షాపు నందు 18 మంది లబ్ధిదారులకు కొరత ఏర్పడింది. ఇలా పూతలపట్టు మండలంలో సుమారు 44 రేషన్ షాపు ఉండగా ఇలా బియ్యం కొరత ఏర్పడడం విస్మయానికి గురి చేస్తున్నది. వివరాల్లోకైతే పూతలపట్టు బియ్యపు గోడౌన్ నందు ఒక బియ్యపు బస్తాలో 50 కేజీలు ఉండాల్సింది పోయి ప్రతి బస్తా నందు రెండు నుంచి మూడు కిలోలు కొరత రావడం హమాలీల చేతివాటమో లేక బియ్యపు గోడౌన్ అధికారి పర్యవేక్షణ లోపమో మండలంలోని లబ్ధిదారులకు శాపంగా మారింది. ప్రతి నెల ప్రతి బస్తా నందు ఇలా కొరత రావడం వల్ల ఆ బియ్యం ఎక్కడికి పోతుందో దీని వెనకాల ఎవరి హస్తముందో తెలియాలని మండలంలోని బియ్యపు కార్డు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా పూతలపట్టు మండలం అభివృద్ధికి నోచుకోకపోవడం వలన చిన్న, కుటీర పరిశ్రమలు లేకపోవడం వలన ప్రజలు వ్యవసాయం మీద తాపీ పనుల మీద ఆధారపడి పేద ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల లబ్ధిదారులకు బియ్యం వస్తేనే ఒక ముద్ద వారు కడుపారా తినగలరని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి లబ్ధిదారులకు సక్రమంగా బియ్యం చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆ బాధ్యత జిల్లా పాలనాధికారిపై ఉందని మండల ప్రజలు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నష్టాల పేరుతో మూత దిశగా ఏపీ సీడ్స్...!



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని రైతు భాగస్వామ్యంతో నడుస్తున్న ఎపి సీడ్స్ మనగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ సంస్థ మనుగడ కొనసాగుతుందా? ఇక్కడితో ఆగిపోతుందా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఉద్యో గులు అధికారి ఏ ఏడాదికి ఆ ఏడాది విత్తనోత్పత్తి లక్ష్యాన్ని ఉద్దేశపూర్వకంగా కుదించి వేస్తున్నారనే ఆందోళన రైతుల్లో వ్యక్తమౌతుంది. ఏటా 1.2లక్షల టన్నుల వరి ధాన్యం విత్తన ఉత్పత్తి లక్ష్యాన్ని నేడు పరిశీలిస్తే ఏడువేల క్వింటాళ్ళకూడా విత్తన ఉత్పత్తిదిశగా సాగటం లేదంటే ఓ ప్రణాళిక ప్రకారం ఈ సంస్థకు చరమ గీతం పాడటానికి కంకణం కట్టుకున్నారా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్లో ఇప్పటి వరకు విత్తన ఉత్పత్తి ప్రారంభించక పోవటం హమాలీలను సింగిల్ డిజిట్ చాలని అధికారి సూచించటం మూతకు సంకేతాలా? అనే చర్చ చోటు చేసుకుంది. విత్తన శుద్ది ప్రారంభించకపోవటం రైతుల నుంచి ధాన్యం సేకరించకపోవటంలో నామమాత్రంగా వ్యవహారించటం పలు సందేహాలకు దారితీస్తుంది.

**సీడ్స్‌కార్పొరేషన్ కథాకమామీషు:**

ఆంధ్ర ప్రదేశ్‌లోని సీడ్స్ కార్పొరేషన్‌కు అనుబంధంగా 1976లో ఇక్కడ ఎపిసీడ్స్ కార్పొరేషన్ ఏర్పడింది. మొదటి 8 సంవత్సరాలు ఈ కార్పొరేషన్ జొన్న విత్తనశుద్దికిఓ బాడుగ గోదాములో నిర్వహించారు. తరువాత రైతుల పెట్టుబడులతో సొంత భవనాలను రూ.కోట్లు విలువ చేసే యంత్రాలను భారీ సరకులు నిల్వ చేసుకునే గోదాములను ఏర్పాటు చేసుకున్నారు. జొన్న విత్తనోత్పత్తి లక్ష్యంగా ప్రారంభం అయిన విత్తనోత్పత్తి కేంద్రం వాతావరణం మార్పుతో కొంత కాలం వేరుశెనగ సరఫరా చేసారు. తరువాత వరి ధాన్యాన్ని శుద్ది చేస్తున్నారు. ఈ కేంద్రం కొత్త వంగడాలను రైతులకు అందించి వారు పండించిన పంటను సేకరించి శుద్ధి చేసి రైతులకు అందిస్తూ వస్తున్నారు. క్రమేణ ఇక్కడ నుంచి వరి వంగడాలు తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ సంస్థ విత్తనోత్పత్తి, శుద్ది లక్ష్యం 1.2లక్షల క్వింటాళ్ళు కాగా గత పది సంవత్సరాల పరిస్థితి పరిశీలిస్తే ఏ ఏడాదికి ఆ ఏడాది ఈ లక్ష్యం సన్నగిల్లుతూ వస్తుంది. స్థానిక అధికారులు, సంస్థ నష్టాల్లో నడుస్తున్నట్లు సృష్టిస్తున్నారు.

**సంస్థపట్ల శ్రద్ధ లేని అధికారులు:**

సంస్థ మనుగడ పట్ల అధికారుల్లో శ్రద్ధ సన్నగిల్లింది. పర్యవేక్షించాల్సిన పాలకులు పట్టించుకోలేదు. గతంలో ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా సంస్థ మనుగడ గురించి ఏ రోజూ పట్టించుకోలేదు. దాంతో ఇక్కడ అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. మిగులు, నిల్వల పేరుతో అధికారులు మూసివేతకు పూనుకున్నారు. మార్కెటింగ్ విభాగంలో పూర్తిగా విఫలమైన అధికారులు నష్టాల బూచిని చూపుతున్నారు. దాంతో రైతుల నుంచి ధాన్యం సేకరణను తగ్గించారు. ఇక సరఫరా చేసిన రైతుల చెల్లింపులకు సంబంధించి ముప్పుతిప్పలు పెడుతున్నారు. సాధారణంగా ఏటా 'బైబ్యాక్' పద్ధతిలో రైతులకు మేలురకం వంగడాలు అందించి రైతులు పండించే సమయంలో పరిశీలించుకుంటూ సూచనలు చేస్తూ పండించిన పంటలను కార్పొరేషన్ సేకరించాల్సి ఉంది. ఈ పద్ధతి గత కొన్ని సంవత్సరాలుగా జరగటం లేదని రైతులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఓ ప్రణాళికా బద్ధంగా మూతకు సన్నాహాలు చేస్తున్నారని వాపోతున్నారు. అయితే కార్పొరేషన్‌ఛైర్మెన్ ఇటీవల ఇక్కడ పర్యటించారు. మే 6న ఇక్కడ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు.

## బిసిఎన్ ఛారిటబుల్ ట్రస్ట్‌చే క్రీడాదుస్తులు వితరణ



**కుప్పందూరల్, ఏప్రిల్ 24ప్రభాతవార్త** కుప్పం బిసిఎన్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్‌లు మరోమారు తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. అ ంతర్ జిల్లా సబ్‌జూ నియర్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ట్రస్ట్ ద్వారా ముప్పై వేల విలువ చూసే క్రీడా దుస్తులను తమవంతుసాయంగా అందించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తమవంతుగా క్రీడా దుస్తులు, పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. దాతలకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కెఇసి ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు,వైస్ ప్రిన్సిపాల్‌భాస్కరన్,శరవణన్,పిఆర్వోప్రవీణ్‌కుమార్, వేణు, గంగాధర్ పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ అధికారులకు ఘన సన్మానం



రామకుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీరాజ్ అధికారులకు దేశం నేతలు ఘనంగా సత్కరించారు. మండల కార్యాలయంలో అధికారులు సుబ్బయ్య, మురళీధర్‌రెడ్డి, సిబ్బందిని శాలువలతో ఘనంగా సత్కరించారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అధికారుల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో నేతలు ఆంజనేయరెడ్డి, సీతాపతి,రామకృష్ణప్ప,రాజసింహ,బాలరాజు,సుబ్రి,అల్లిశీను,ఆంజనేయప్ప,మురళి, భాస్కర్ పాల్గొన్నారు.

## బ్రాహ్మణ విద్యార్థులకు న్యాయం చేయాలి

కుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

కర్ణాటక రాష్ట్రం బీదర్, శివమొగ్గ పట్టణాల్లో సెట్ పరీక్షల సందర్భంగా బ్రాహ్మణ విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం దారుణమని ఏపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మైసూరు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. బ్రాహ్మణ విద్యార్థుల యగ్నోపవీతాలను కత్తిరించి చెత్తలో పడేయడం తగదన్నారు. బ్రాహ్మణ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాకుండా చేసే కుట్రగా ఈ సంఘటన జరిగిందన్నారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే ఈసంఘటనపై స్పందించి తప్పుచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్షలకు హాజరు కాని బ్రాహ్మణ విద్యార్థులకు మరలా పరీక్షలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

## మిస్టర్ ఇండియా ఫ్రాన్స్‌ను అభినందించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పలమనేరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ 2025 విజేత జ్ఞాకరణ్ శ్రీకరణ్‌ను గురువారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభినందించారు.ఈ నెల 5న పారిస్‌లో మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ పోటీలలో బరిలో నిలిచి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచి విజేతగా నిలిచిన శ్రీకరణ్ గురువారం తమిళనాడు రాష్ట్ర క్రిష్ణగిరికి చెందిన ప్రముఖ వ్యాపారి రాజన్ ప్రభాకర్‌తో కలసి ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలవడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీకరణ్‌ను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలను తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గదర్శకులు



**కల్లూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గదర్శక లాంటి వారిని మాజీ జెడ్పిటిసి మురళీధర్ అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు రాజేంద్ర పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు సిద్దరామయ్య పోకల తాతయ్య మాట్లాడుతూ విద్యా బోధనలో ఉపాధ్యాయులు రాజేంద్ర సేవలు ప్రశంసనీయమని అన్నారు. అనంతరం ఉపాధ్యా యులు రాజేంద్ర. వరలక్ష్మి దంపతులను ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధు మిత్రులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి రొంపిచర్ల ఎంఈఓ శ్రీనివాసులు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పోతంశెట్టి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

**రొంపిచెర్ల, ఏప్రిల్24, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయమని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. రొంపిచెర్ల, బొమ్మయ్య గారి పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభలు నిర్వహించారు. గ్రామపంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా త్రాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రొంపిచెర్ల పంచాయతీ ఈవో సత్యం రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు దశరథ శేఖర్ రెడ్డి, హరిబాబు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నంది వాహనంపై ఊరేగిన శివపార్వతులు

**సోమల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** సోమల నడిబొడ్డున వెలసిన స్వయం బీశ్వరుని బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం నందీశ్వరుని పై ఆశీనులైన శివపార్వతులు సోమల పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వయంబీశ్వరునికి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. దీంతో వందలాది మంది భక్తులు పుష్ప పల్లకి సేవలో పాల్గొని తరించారు. బజారు వీధి ఎగువ వీధి ప్రజలు ఉభయ దారులుగా వ్యవహరించారు.



## సోమల హైస్కూల్ టాపర్ వంశీ సాయి

**సోమల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో సోమల జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి పల్లా వంశి సాయి 600 గాను 571 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. సోమల బస్టాండ్ లో చిన్నపాటి హో టల్ నడుపుకుంటున్న పల్లా చంద్రబాబు, స్వాతి దంప తుల కుమారుడు మండల టాపర్‌గా నిలవడంతో ప్రధానో పాధ్యాయులు హరినాథ్ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

## ఉగ్రదాడిలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

– ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్

**పాలసముద్రం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ పేర్కొన్నారు. ఈ హింసాత్మక ఘటన మన మనస్సులను కలచివేస్తోందని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలుపుతన్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు. ఉగ్రవాదంను తీవ్రంగా ఖండిస్తున్నట్లు, శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యనైనా తిప్పికొడ్తామని ఆయన హెచ్చరించారు.

## కోరం లేక మండల సమావేశం వాయిదా!

**శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండల సర్వసమావేశం కోరం లేక వాయిదా పడింది. వైకాపా హయాంలో ఏకగ్రీవంగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఎంపికయ్యారు. ఐదేళ్ళ పాటు గ్రామ సర్పంచ్‌లుగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. నిధుల కొతరతో సర్పంచ్‌లుగా కాలం గడిపారు.దాంతో సర్పంచ్‌లు ఎంపిటిసిలు నిరాశ నిస్పృహలకు గురయ్యారు. అంతేకాక గెలిచిన వారందరు వైకాపా మద్దతు దారులు కావటం ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండటంతో గ్రామ సర్పంచ్‌లు నిరాశలో ఉన్నారు. అంతేకాక వారి పదవి కాలం దాదాపు పూర్తి కావచ్చింది. దాంతో

## చిట్రెడ్డిపల్లిలో ఘనంగా గంగజాతర



**చౌడేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లిలో గంగజాతరను ఘనంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి గంగమ్మను నడివీధిలో నెలకొల్పి విశేష పూజలు చేసారు. రాత్రంతా మహిళలు గ్రామంలోని చుట్టుపక్కలున్న గ్రామ దేవతలను పిండి దీపాలతో ఆరాధించారు. పొట్టకూటి కోసం బయట ప్రాంతాలకు వెళ్ళిన వారందరూ జాతరకు తరలిరావడంతో చిట్రెడ్డిపల్లిలో సందడి వాతావరణం నెలకొనింది.

## చౌడేపల్లి మండల వైకాపా అధ్యక్షుడుగా నాగభూషణరెడ్డి

**చౌడేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** మండల వైకాపా అధ్యక్షుడుగా పెద్దకొండామర్రికి చెందిన గౌడప్పగారి నాగభూషణరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు గురువారం వైకాపా కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తొలి నుంచి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విధేయుడగా వుంటున్న ఆయనకు పార్టీ అధిష్టానం మండల పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. తనపై నమ్మకంతో మండల పార్టీ పగ్గాలను అప్పగించిన అధిష్టానానికి, పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు నాగభూషణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి పాటుపడతానని ఆయన తెలిపారు.

## నేటి నుండి న్యాయవాదుల విధుల బహిష్కరణ..!

**చిత్తూరుటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** కాశ్మీర్ లో భారత ప్రజలపై ఉగ్రవాదులు దాడులు చేసి హత్యలు చేయడాన్ని నిరసిస్తూ రెండు రోజులు పాటు న్యాయవాదులు విధులు బహిష్కరించడానికి తీర్మానించారు. కాశ్మీర్లో 27 మందిని ఉగ్రవాదులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. చిత్తూరు న్యాయవాదుల సంఘం కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు కె. శంకర్ నాయుడు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఉగ్రవాదుల దాడులను కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఈ దాడులను నిరసిస్తూ గురువారం శుక్రవారం విధులు బహిష్కరించాలని న్యాయవాదుల సంఘం తీర్మానించింది. అంతకుముందు మృతుల కుటుంబాలకు సమావేశం నివాళులర్పించింది.ఈ సమావేశంలో కార్యదర్శి సురేష్ రెడ్డి నాయకులు తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు. .

## మాజీ మంత్రిని కలసిన రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి శ్యామ్



**పలమనేరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ను వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుత్త కార్యదర్శి శ్యామ్ సుందర్ రాజ్ మర్యద పూర్వకంగా కలవడం జరిగింది.నూతన వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుత్త కార్యదర్శిగా ఎన్నిక కావడానికి సహకరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలను తెలిపారు.

## ఉద్యోగులు అంకితభావంతో పనిచేయండి



పెద్దపంజాణి,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని పెద్దపంజాణి ఎంపిడిఓ బాలాజీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి,పేదరిక నిర్మూలనకు,సంక్షేమ పథకాల అమలుకు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించేందుకు ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని కోరారు.మనమిత్ర యాప్ ద్వారా ప్రజలకు అంతర్జాలంలో అనేక రకాల సేవలను ప్రజల ముందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి జిడి బాబు,ఏపిఎం వెలుగు మండల స్థాయి అధికారి మీరాభయి,మండల విద్యాశాఖ అధికారులు గోపాల్‌రెడ్డి,తులసీరామర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం



యర్రావారిపాలెం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వైఎస్సార్సీపీ చంద్రగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షులు చెంగల్ రెడ్డి ఘనంగా సన్మానించారు. యర్రావారిపాలెం మండలం, ఎల్లమంద పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. పల్లవుల ప్రణవి 561 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో బొగ్గుల లావణ్య 506 మార్కులు, గుండ్లూరి పూర్ణ చంద్ర 506 మార్కులు సాధించారు. వీరిని ఘనంగా సన్మానించి, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎర్రావారి పాలెం మండల వైఎస్ఆర్సీపీ గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షులు వీర నాగేంద్ర, నాగులేష్, పరందామయ్య, చంద్రశేఖర్ రెడ్డి, మాలేశ్వరనాయుడు, శ్రీనివాసులు, నాగార్జున, వెంకటరమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



**కల్లూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ పరిధిలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పంచాయతీ పాలనలో చేపడుతున్న అభివృద్ధి పనులు పారిశుద్ధ కార్యక్రమాలు నిధులు మంజూరు చేశారు. తదితర వాటిపై సమగ్రంగా వివరించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షులు ఇన్నయతుల్లా, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనసేనచే పహల్గామ్ ఉగ్రదాడులను ఖండిస్తూ నిరసన



కుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడులను ఖండిస్తూ కుప్పంలో జనసైనికులు గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా స్థానిక బస్టాండు వద్ద ఉగ్రదాడుల్లో మృతి చెందిన జనసేన కార్యకర్త, నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదనరావు చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. జనసేన కోఆర్డినేటర్ నరేష్ మాట్లాడుతూ మధుసూధన్‌రావు ఉగ్రవాదులకు ఎదురుతిరిగి పోరాడి వీరమరణం పొందాడన్నారు. ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు జనసేన తరపున ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ పద్మశ్రీ రామకృష్ణారెడ్డి మృతి



**కుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** ద్రవిడ వర్సిటీ వ్యవస్థాపక రిజిస్ట్రార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా॥ బి. రామకృష్ణారెడ్డి అకాల మరణం చెందారు. గురువారం వర్సిటీ ప్రాంగణంలో పద్మశ్రీ రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూజలు చేసి వర్సిటీ విసి ఆచార్య ఎం. దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్‌లు ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వి.సి. మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి, సాహితీ లోకానికి రామకృష్ణారెడ్డి చేసిన సేవల గురించి వివరించారు. ఆయన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేసిందన్నారు. వర్సిటీ ఉద్యోగులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, ఇంజనీర్ రఘుపతి, ఉద్యోగులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జనసేనచే మౌన ప్రదర్శన కొవ్వొత్తుల ర్యాలీ



**చౌడేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** జనసేనపార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు మహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ ఆపార్టీ నాయకుడు గందోడి చరణ్ రాయల్ ఆధ్వర్యంలో చనిపోయిన వారి సంతాప సూచికంగా పట్టణం నందు మౌన ప్రదర్శన, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ముష్కరుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. జనసేన నాయకులు పిల్లారి జీవన్ ప్రకాష్, కార్తీక్, హరిరాయల్, విద్యాసాగర్‌నాయుడు, సాయికిరణ్, గణశ్యామ్, మురళి, లీలాకుమార్‌నాగ్, నాగరాజ, రాకేష్, నరేష్, బిజెపి గందోడి ప్రవీణ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా చవటగుంట మహాభారతం ధ్వజారోహణం



వెదురుకుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

మడలంలోని చవటగుంట మహాభారతం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణం కార్యక్రమంలో ప్రారంభించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మహాభారత యజ్ఞం ప్రారంభంకు అంకురార్పణ చేశారు. ఉభయదాతలు చవటగుంటగ్రామంకు చెందిన మాజీ బిపియం పేట సహదేవ రెడ్డి వారసులు సౌజన్య జయప్రసాద్ రెడ్డి, రాజేశ్వరి పద్మనాభ రెడ్డి, శ్రీదేవిఢిల్లీప్రసాద్ రెడ్డిలు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఏప్రిల్ 24నుంచి మే 4 వరకు హరికథ భాగవతారణి వనరస విజయకుమారిచే హరికథ గానం, ఏప్రిల్ 25 నుంచి మే 4 వరకు శ్రీవెంకటేశ్వర నాట్యకళామండలి వారిచే రాత్రి వీధి నాటకాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణా రెడ్డి, మాజీ ధర్మకర్త ఉమాపతి రెడ్డి, ముఖ్యకార్యనిర్వహకులు ఆంజనేయులు రెడ్డి, కృష్ణా రెడ్డి, కొండా రెడ్డి, నరసింహ రెడ్డి, ఆనంద రెడ్డి, జయరాం, లోకనాథ రెడ్డి, సభాపతి రెడ్డి, జయరామ రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, రామయ్య, ప్రకాష్, పెద్ది రెడ్డి, జయరామ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం



**వెదురుకుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో బుధవారం ఘనంగా జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం నిర్వహించారు. మహాత్మగాంధీ చిత్ర పటంకు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడివో పురుషోత్తం మాట్లాడుతూ దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని పల్లెల అభివృద్ధిలో దేశాభివృద్ధి దాగివుందని మహాత్మగాంధీ చెప్పిన విషయం గుర్తుచేసుకున్నారు. కావున గ్రామస్థాయిలో పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు తాగునీటి వసతి కల్పన ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏవో నాగమణి, పంచాయితీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేంటాలచేనుకు చెందిన పద్మశ్రీ ఆచార్య రామకృష్ణా రెడ్డి కన్నుమూత

**వెదురుకుప్పం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** పద్మశ్రీ ఆచార్య బండి రామకృష్ణా రెడ్డి(84) అనారోగ్యంతో హైదారాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఆయన మేనల్లుడు యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యలుఈశ్వర్ రెడ్డి బుధవారం తెలిపారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయితీ రేంటాలచేను గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సరస్వతీపుత్రుడు రామకృష్ణారెడ్డి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ హిందీ,పూణెలోని డెక్కన్ కాలేజీలో ఏంఏ భాషాశాస్త్రం చదివారు. తరువాత కొంతకాలం అన్నామలై విశ్వవిద్యాలయం, సీఐఐఎల్ మైసూర్‌లో పనిచేవారు. కామన్వెల్ ఫెలోషిప్ పై యూకే వెళ్ళి ఆండర్సన్ కేస్ గ్రామర్ పై పీహెచ్‌డీ పట్టాసాధించారు. 1977లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా చేశారు. 1990లలో పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించి రిజిస్ట్రార్‌గా పనిచేశారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు.ఆయన ఇంది–ఆవే భాషకు లిపి తయారు చేశారు. అనేక గిరిజన భాషలపై పనిచేసి భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

## శ్రీ చౌడేశ్వరి దేవికి వైభవంగా హోమ పూజ నైవేద్యాలు



**పుంగనూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** మండలంలోని చదళ్ల గ్రామంలో వెలసినశ్రీ సప్తమాతృక సమేత శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి అష్టమ వార్షిక ఉత్సవాలు వైభవంగా ఇందులో భాగంగా గురువారం అమ్మవారి ఆలయంలో వేద పారాయణంతో గణపతి పూజ హోమాలతో వైదిక అర్చన ప్రారంభించారు. రిత్వికులు ఆలయ ప్రాంగణంలో నవగ్రహ హోమం త్రిమూర్తుల హోమం, శ్రీ చౌడేశ్వరి అమ్మవారి హోమం, శ్రీ సప్తమాతృకల హోమము, శ్రీ కాలభైరవ, శ్రీ విమాన గోపుర హోమాలను నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకులు, జనసేన అధినేత వేణుగోపాల్ రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా హోమాలలో పాల్గొని పూర్ణాహుతి మహా మంగళ హారతి అందించారు. పలమనేరు ఎన్ కే ఎన్ ఈవెంట్స్ అధరంలో జరిగిన డాన్స్ కార్యక్రమం ప్రజలను అలరించింది.

## తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వండి



**పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** లైసెన్సు లేక వాహనాలు నడిపే పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు సిఐ సుబ్బారాయుడును కోరారు. గురువారం రిటైర్డ్ ఎస్పై సత్యనారాయణ ఎంఎన్ఓ దేశాది శ్రీనివాసులు తెలుగుదేశం ఆర్యవైశ్య నాయకులు రవికుమార్‌లతో కలిసి సిఐ సుబ్బారాయుడుతో పలు విషయాలపై చర్చించారు. పుంగనూరు టౌన్‌లో ఉన్న అస్తవ్యస్త ట్రాఫిక్‌ని దారిలో పెట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ జరిమానా, దానిపై అవగాహన కల్పించాలని కోరారు. మైనర్ పిల్లలకు టూవీలర్లు వాళ్ళ తల్లిదండ్రులను హెచ్చరించాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ

చిత్తూరురూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం, లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం నందు ప్రజా దర్బార్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతుల స్వీకరణ జరుగుతుందనీ, ప్రతి ఒక్కరు తమ వినతిపత్రంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌ను జత చేయాలని సూచించారు.నియోజకవర్గపరిధిలోని సంబంధితశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

## ఘనంగా సత్యసాయి ఆరాధన దినోత్సవం

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 24ప్రభాతవార్త:** చిత్తూరునగరం, గిరింపేటలోని శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు స్వామివారి 14వ ఆరాధన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఓంకారం సుప్రభాతం, నగర సంకీర్తన, అభిషేకములు, సాయి అష్టోత్తరం, హారతి ప్రసాదవితరణ, . అలాగే సంతపేటలోని మాతృసమితి వాసులకు అన్నప్రసాదం అందించారు. సాయంత్రం పుష్పయాగం, సాయి సహస్ర నామార్చనలతో స్వామి పంచరత్న కీర్తనలు, భజన సత్సగం, మంగళహారతి అనంతరం భక్తులను ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

## పాకిస్తాన్ దేశాన్ని వెంటనే ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి..కోలా



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** పాకిస్తాన్ దేశాన్ని వెంటనే ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం వద్ద అమాయకులైన పర్యాటకులపై విచక్షణారహితంగాపాకిస్తాన్ ఉగ్రమూకలు జరిపిన కాల్పులను బిజెపి నేత కోలా తీవ్రంగా ఖండించారు. గురువారం ఇందుకు నిరసనగా 26మంది ప్రాణాలు కోల్పోయారని వారికి రాష్ట్రీయస్వయం సేవక్ సంఘం, బిజెపి నాయకులు, భజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్, వివిధ కులాల సంఘాలు పెద్దలుదీన్ని తీవ్రంగా ఖండించారు. కొవ్వొత్తులతో నాలుగుమాడావీధుల్లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోలా.ఆనంద్‌కుమార్‌తో పాటు, మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, పలువురు బిజెపి నాయకులు పాలొన్నారు.

## పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ శ్రీకాళహస్తిలో వైఎస్ఆర్‌సిపి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని నిరసిస్తూ మృతిచెందినవారి ఆత్మలకు శాంతి కలగాలని మాజీ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి సూచనలతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరుతారకశ్రీనివాఉలు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాశ్మీర్‌లోని అందాల ప్రదేశాలను చూడడానికివచ్చిన అమాయక ప్రజలపై ఉగ్రవాదులు దాడిచేయడం ఎంతో సంతోషమన్నారు.కేంద్రప్రభుత్వం వెంటనే ఈదాడిచేసిన వారిని పట్టుకుని అందరి ముందు కఠినంగా ఉరితీయాలన్నారు. కార్యక్రమంలో శ్రీవారి సురేష్, ఫటాన్‌ఫరీద్, సాధనమున్నారాయల్, కంటా ఉదయ్‌కుమార్, సిరాజ్‌బాషా, ఉత్తరాజిశరవణకుమార్‌శ్రీనివాస్‌రెడ్డి, కోళ్ళూరుహరనాథ్‌నాయుడు, శంకర్, నారాయణ, ఫజల్, ఆర్కాడు ముత్తు, శంకర్‌ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** విద్యార్థులును తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సాయిరాం ఇంగ్లీష్‌మీ డియం స్కూల్ కరస్పాండెంట్ పి.మాలతి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో 2024-25 విద్యాసంవత్సరంలో విద్యార్థులు అభివృద్ధి క్రమశిక్షణ, తల్లిదండ్రుల సమస్యలు గురించి చర్చించారు. అనంతరం రాబోవు విద్యాసంవత్సరం2025-26లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వసతులు, చదువులు ఎలా ఉండాలో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఫీజులు, క్రమశిక్షణ, పుస్తకాలును తగ్గించడం గురించి కూడా చర్చించారు. అతితక్కువ ఫీజులతోనే నాణ్యమైన విద్యను అందించాలని తీర్మానం చేశారు. తాము కూడా యాజమాన్యానికి సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని అడ్మిషన్లు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మాలతితో పాటు చెంచుకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిస్కారంలో నిర్లక్ష్యం వద్దు - గాలి భానుప్రకాష్

**వడమాలపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. వడమాలపేట మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు జాగరూకతతో విధులు నిర్వహించాలని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజల అవసరాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఎస్‌బీఆర్ పురం రోడ్డుకిరువైపులా చెట్లకు నీళ్లు పోయడానికి ఉపాధి సిబ్బంది సహకరించడం లేదని సర్పంచ్ మణిరాజు ఆరోపించారు. గ్రామాల్లో డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీరు అక్రమ నిల్వల కనెక్షన్లపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని కోరారు.

## చియ్యవరంలో భూవివాదాన్ని పరిష్కరించిన ఆర్డీవో



**తొట్టంబేడు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** మండలంలోని చియ్యవరం గ్రామంలో ఏళ్ళ తరబడి ఉన్న భూవివాదాన్ని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి పరిష్కరించారు. ఇక్కడ గ్రామంలో 2003లో సుమారు 20మందికి పట్టాలు ఒక్కొక్కరికి 1.40 ఎకరాలు ఇచ్చారు. అయితే వీటిని కొందరు సాగుచేసుకోగా మరి కొందరు వారి ఇష్టం వచ్చినపుడు సాగుచేసుకుని పంటలు పండించుకున్నారు. గ్రామంలో 8మంది రైతు లకు చెందిన భూములకు సంబందించి నిరంతరం పిజిఆర్ఎస్‌లో పిటిషన్లు వస్తుండడంతో ఆర్డీవోనే స్వయంగా రంగంలోని దిగి తహశీల్దార్, సర్వేయర్, సచివాలయ సర్వేయర్, విఆర్ఓలతో పాటు గ్రామానికి చేరుకుని రైతుల సమస్యలను చర్చించారు. ఇక్కడ ఓ రైతు సుమారు 15ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నారని తెలుసుకున్న ఆర్డీవో వెంటనే సర్వేచేసి వారికి ఎంత భూములు ఉన్నాయో వారికే కేటాయించాలని, చెరువులు, తూములు ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. ఆర్డీవోతో పాటు తహశీల్దార్ మధుసూధనరావు, డిటి జగన్‌మోహన్, సర్వేయర్ హరనాధ్, సచివాలయ సర్వేయర్, విఆర్ఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులు

కేవీబీ పురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: విడుదలైన పది పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థిని, విద్యార్థులను వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, ముందుండి నడిపించినటువంటి ప్రధానోపాధ్యాయులను, వారి తల్లిదండ్రులను మండల విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలియజేశారు. కేవీబీ పురం మండలంలో ఎం.చందనప్రియ ఏపీ మోడల్‌స్కూలు విద్యార్థిని 600 మార్కులు సాధించింది. అంజూరు స్కూలుకు చెందిన బి.దివ్య 559, ఏపీ మోడల్ స్కూలు విద్యార్థిని ఎం.యాస్మి 556 మార్కులు సాధించిన తృతీయ స్థానంలో నిలిచింది.

## పది ఫలితాల్లో అకడమిక్ హైట్స్ విద్యార్థులు విజయభేరి



**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త** స్థానిక ఎమ్.ఆర్.పల్లి ఎయిర్ బైపాస్ రోడ్డు నందు గల అకడమిక్ హైట్స్ పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులు 2014-25 వ సంవత్సరములో జరిగిన పదవతరగతి పరీక్షా ఫలితాలలో విజయభేరి మోగించారు.ఇందులో యస్.సుస్మిత 592 మార్కులతో ప్రథమస్థానం లోను,పి. సుహానా 591 మార్కులతో ద్వితీయ స్థానంలోను, కె. జాస్మిత 584 మార్కులతో తృతీయ స్థానం లో నిలిచారు.పరీక్షకు హాజరైన 42 మంది విద్యార్థులలో 590కి పైగా ఇద్దరు,550 కి పైగా 24 మంది, 500కి పైగా 32 మంది ఉత్తమ ఫలితాలను సాధించారు.ఈ విజయాన్ని సాధించిన విద్యార్థినీ,విద్యార్థులను పాఠశాల డైరెక్టరు యమ్.హిమసాగర్ కృష్ణ,ప్రధానోపాధ్యాయులు కె. మురళీ కృష్ణ పిల్లలను ప్రశంసిస్తూ చక్కటి ఆశీస్సులందించి అభినందించారు.

## 22 మంది విద్యార్థులు డీబార్

**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త**

ఎస్వీయూ పరిధిలో గురువారం నుంచి ప్రారంభమైన డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలలో తొలిరోజు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 22 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైపవర్ ఇన్స్పెక్షన్ కమిటీ ఇచ్చిన సమాచారం మేరకు మదనపల్లి జోన్ పరిధిలో 16మంది, చిత్తూరు జోన్ పరిధిలో 6మంది విద్యార్థులు మాస్కాపీయింగ్ కు పాల్పడగా అధికారులు డీబార్ చేసినట్లు తెలియజేశారు.

## చంద్రగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కుంభ నాగరాజ

**యర్రావారిపాలెం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

చంద్రగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా యర్రావారిపాలెం మండలం టిడిపి నాయకుడు కుంభ నాగరాజును కూటమి ప్రభుత్వం నియమించారు. ఆయన యర్రావారిపాలెం ఎస్టీ సెల్ అధ్యక్షుడుగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేసినందుకు గాను ఈ గుర్తింపు లభించింది అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ముందుంటానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించి, తన నియామకానికి కృషిచేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ సి.యం. జగన్‌ను కలిసిన తిరుపతిరూరల్ వైకాపా నేతలు



**తిరుపతిరూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డిని గురువారం తిరుపతిరూరల్ వైకాపా నాయకులు కలిసారు. ఇటీవల తిరుపతిరూరల్ మండలాధ్య పదవిని వైసిపి కైవసం చేసుకుని, మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెల్సిందే. కూటమి ప్రభుత్వంలో మండలాధ్యక్ష పదవిని వైసిపి చేజిక్కించుకోవడంపై జగన్మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేసినట్లు సమాచారం. రాబోయే ఎన్నికలలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో చంద్రగిరి వైకాపా ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విడదల మాధవరెడ్డి, ఎంపిటిసి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గసముద్రంలో అక్రమ ఇసుక వ్యాపారాన్ని అరికట్టాలి



**తిరుపతిరూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రంలో అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు కొనసాగుతున్నా....ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసారు. దుర్గసముద్రం విఆర్వో ప్రజలకు తెలియడం లేదని, విఆర్వో ఆచూకి తెలియజేయాలని డిమాండ్ చేసారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దుర్గసముద్రం గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని, రెవెన్యూ సమస్యలు పరిష్కరించుటకు విఆర్వో ప్రజల్లోకి రావాలని, డ్రైనేజ్ నీళ్ళు బోరు మోటరులో ఇంకుతున్నాయని, ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజ్ నీళ్ళు పారుదలకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఉప సర్పంచ్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి ఎస్.నరసింహులు, విఆర్ఏ ముని తదితరులు పాల్గొన్నారు.

## పివిఆర్ గ్రూప్‌చే అడ్వాన్సు పన్ను చెల్లింపు



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త** ప్రభుత్వం కల్పించిన అడ్వాన్సు టాక్సు రాయల్టీని శ్రీకాళహస్తికి చెందిన పెద్ద పెద్ద కంపెనీలు సద్వినియోగం చేసుకుంటున్నారు. గురువారం పివిఆర్ గ్రూప్స్‌కు చెందిన యజమానులు పెద్ద మొత్తంలో చెల్లించినట్లు కమిషనర్ బియస్ గిరికుమార్ వివరించారు. ప్రభుత్వం 2025-26కు సంబంధించి అడ్వాన్సు టాక్సు చెల్లించిన వారికి రాయల్టీ ప్రకటించారు.దాంతో మున్సిపల్ కమిషనర్ బియస్ గిరికుమార్ తన సిబ్బందిని పరుగులు తీయిస్తున్నారు. ఈ ఏడాది అడ్వాన్సు పన్ను చెల్లింపులో భాగంగా గురువారం పివిఆర్ గ్రూప్ రూ.9,47.309లు స్థిరాస్తి, నీటి కొళాయిల పన్నులను చెల్లించారు. గ్రూప్‌కు చెందిన డైరెక్టర్లు జనార్ధన్‌రావు పవార్, మధు పి పవార్,మహేశ్వరరావులు బిల్‌కలెక్టర్ శరత్‌కుమార్ ద్వారా పంపినట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు.

## వైకాపా కుటుంబసభ్యుడు మృతి : సంతాపం



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త** పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన బొద్దులూరు గోపి కృష్ణ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఉదయం ఆయన మృతదేహానికి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరులు మృతదేహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఎంఆర్ మురళి యాదవ్, దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు సాధన మునస్వామి మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణ కుమార్, కంఠాఉదయ్‌కుమార్ నియోజకవర్గం యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, పగడాల రాజు, పఠాన్ ఫరీద్‌ఖాన్,గోర,షఫీ, విజయకుమార్‌రెడ్డి, తీగల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనలో పోలీసుల పల్లె నిద్ర:



**శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఊరందూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ముళ్ళపూడి గిరిజన కాలనీలో గురువారం రూరల్ పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో పల్లెనిద్ర కార్యక్రమాలను సిఐ రవినాయక్ సారథ్యంలో వారి సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవినాయక్ గ్రామంలోని గిరిజనులను చైతన్య పరుస్తూ పోలీసు చట్టాలను గురించి వివరించారు. పోలీసులు కూడా మీలో ఒక్కరే అని గుర్తించుకోవాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.రాత్రి బాగా పొద్దుపోయేదాక విద్యార్థులకు నీతి కథలు జాతక కథలు, బాలల నీతి కథలు,పంచతంత్ర కథలను వివరిస్తూ పుస్తకాలను కూడా పంపిణి చేసారు.ఈ కార్యక్రమాల్లో సిఐ రవినాయక్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ మునిరాజా, కానిస్టేబుల్ పెంచల కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాన్ని పీడిస్తున్న దీర్ఘకాలిక సమస్యలపై సిఐ గ్రామస్తుల్ని వాకబు చేసారు. గ్రామస్తులు పోలీసులతో మమేకమయ్యారు.

## పెంకుల పాడులో మాజీ ఎంఎల్‌ఏ



**శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండలం పెంకుల పాడు గ్రామంలో మృతి చెందిన మద్దు రమేష్‌యాదవ్ కుటుంబాన్ని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పరామర్శించారు. గురువారం మద్దు రమేష్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సాధన మునస్వామి రాయల్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణకుమార్, కంఠాఉదయ్‌కుమార్, శ్రీవారి సురేష్, పగడాలరాజు తదితరులుపాల్గొన్నారు.

## పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి!



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 24 ప్రభాతవార్త** పిల్లల పట్ల తల్లిదండ్రులు సమయం కేటాయించాలని వారిని తీర్చి దిద్దటంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేసే కృషితో పాటు ఇంట్లో తల్లిదండ్రులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని పిల్లల్ని సెల్‌ఫోన్లతో దూరంగా ఉంచాలని జడ్జి బేబీ రాణి అన్నారు. శ్రీకాళహస్తిలోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా వచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు ఇంటిలో తల్లిదండ్రులు వారిపట్ల కొంత సమయం కేటాయించాలని, శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఏం చెబుతున్నారు? అనే అంశాలకు సంబంధించి ఇంటిలో తల్లిదండ్రులు వాకబు చేసి వారికి ఇంటి వద్ద సంప్రదాయాలు,టీచర్ల పట్ల ఎలా ప్రవర్తించాలి? కుటుంబ వ్యవస్థలో ఎవరెవరుఎలా ఉండాలి? ప్రేమ, బంధాలకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. వార్షికోత్సవ సభకు కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథులుగా ఎంఇఒలు భువనేశ్వరి, బాలయ్య,సుబ్బరామిరెడ్డి,శ్రీకాంత్, రవీంద్ర ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. స్పెల్లింగ్‌లో మొదటి బహుమతి సారాఫిర్‌దౌస్‌కు అందించారు.కాగా క్లాస్‌లో మూడవ బహుమతిని అందుకుంది.

**అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు:** ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ పాఠశాలకు చెందిన చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఓ బృందం ప్రదర్శించిన నృత్యప్రదర్శనలో అబూబకర్ సిద్దిఖ్, అఫీ, సారా ఫిర్‌దౌస్, ఆరపాల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే సుమారు 20కార్యక్రమాలను నిర్వహించారు.

## టెన్త్ ఫలితాల్లో నలంద హైస్కూల్ విద్యార్థులు హవా




**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త** :పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నలంద హై స్కూల్ ఘన విజయం సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ ఓబుల వెంకట రమణారెడ్డి, డైరెక్టర్ ఓబుల ఆనంద రెడ్డి విద్యార్థిలకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన కె జ్యోత్స్న 581, పి చతురా రెడ్డి 575,ది ప్రణతి 562,జి స్నేహ 557, కె డింపు ప్రియా 550 వీరు విజయ పథకాన్ని ఎగరవేశారని తెలిపారు. 500 మార్కులు పైన సాధించిన వారు 14 మంది సామాన్య విద్యార్థులతో అసమాన్య ప్రగతి సాధించిన విద్యాసంస్థ నలంద హైస్కూల్ అని తెలిపారు.

## పది ఫలితాలలో భాష్యం విద్యార్థులు ప్రతిభ



**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త** స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ బాలాజీ కాలనీలో గల భాష్యం బృహస్పతి కేంపస్ నందు 2024-2025 విద్యాసంవత్సరంలో 31 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాశారు. ఇందులో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు చెందారు.589 మార్కులు అత్యధిక మార్కులు, 9 మంది విద్యార్థులుకు 580 పైన మార్కులు, 5 మందికి 570 పైన మార్కులు, నలుగురికి 560 పైన మార్కులు,మరో నలుగురికి 550 పైన మార్కులు,ఐదుగురికి 500 పైన మర్కులు వచ్చాయి .పాఠశాల సగటు మార్కులు 552 మార్కులు.మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులందరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేతాజీ,ఉపాధ్యాయుల బృందం హృదయ పూర్వకంగా అభినందించారు.

## పది ఫలితాలలో సిల్వర్ ఓక్స్ స్కూల్ విజయ ఢంకా



**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త** స్థానిక భవానీ నగర్లోని సిల్వర్ ఓక్స్ స్కూల్ విద్యార్థులు ఎస్ ఎస్ సి 2025 ఫలితాలలో విజయభేరి మ్రోగించారు. ఎం హసిత 586 మార్కులు సాధించి స్కూల్ టాపర్గా నిలిచింది.జి రెడ్డి ప్రసాద్ ద్వితీయ స్థానంలో, ఎం గణేష్ తృతీయ స్థానంలో నిలిచారు.550 మార్కులు కి పైగా 29 మంది,500 మార్కులు కి పైగా 30 మంది విజయం సాధించారు.ఈ అద్భుత ఫలితాలను సాధించిన విద్యార్థినీ,విద్యార్థులకు ఆ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి స్కూల్ కరస్పాండెంట్ కే ఎస్ వాసు అభినందనలు తెలిపారు.

## ఉగ్రదాడి హేయమైన చర్య..



**రేణిగుంట ఏప్రిల్ 24 ప్రభాత వార్త** జమ్మూ కాశ్మీర్ పెహల్గాం లో భారత హిందూ పర్యటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైన చర్య అని పలు ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, రాజకీయ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముక్త కంఠం తో ఖండించారు. రేణిగుంట పట్టణంలో వర్కింగ్ జర్నలిస్టులు బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ర్యాలీలో సీనియర్ జర్నలిస్టులు శివమూర్తి, ఉమేష్, మణి ,భాగ్యరాజ్, రాజశేఖర్, కృష్ణమూర్తి, చిన్నారావు, మధు,జలీల్, బాలు, శివ, కృష్ణ, అప్సర్, రిహాన్, నాగూర్, తదితరులు పాల్గొనగా బిజెపి నాయకురాలు రాష్ట్ర వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి ఆధ్వర్యంలో పలువురు నాయకులు రేణిగుంట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు, సిపిఎం నాయకులు ఓ వి రమణ, హరినాథ్, సెల్వరాజ్, సిపిఐ నాయకులు తులసి రాజన్, రేణిగుంట సర్పంచ్ నాగేశం తదితరులు దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



**రేణిగుంట ఏప్రిల్ 24 ప్రభాతవార్త** రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు సర్పంచ్ నాగేశం అధ్యక్షతన కార్యదర్శి మణి పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాగేశం మాట్లాడుతూ ప్రజా పరిపాలన వ్యవస్థలో పంచాయతీ రాజ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పంచాయతీల వల్ల దేశం మారుమూలన ఉన్న గ్రామాల్లో కూడా సుపరిపాలన అందుతుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్ వి చిల్డ్రన్స్ హై స్కూల్ విద్యార్థులు విజయ దుందుభి



**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త** స్థానిక టి ఎన్ పాలెంలోని శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హై స్కూల్ న్యూ జన్ క్యాంపస్ నందు ఎస్ ఎస్ సీ 2025 ఫలితాల్లో విజయదుందుభి మ్రోగించింది.254 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవగా 249 మంది విద్యార్థులు ఫస్ట్ డివిజన్ సాధించారు. 254 విద్యార్థులకు గాను 163 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించారు.595 మార్కులు సాధించి కే సంయుక్త మొదటి స్థానంలో నిలిచారు. కే వేణు 593, ఎం భవ్య శ్రీ 592 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.పాఠశాల అధినేత కె.యస్.వాసు విద్యార్థులను,వారి తల్లితండ్రు లను, ఉపాధ్యాయులనుఅభినందించారు.అలాగేపాఠశాల హెచ్ ఎం పి. సప్నలత విద్యార్థులను అభినందించారు.

## పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి దారుణం



**తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణలు అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందినా వారికి నగరపాలక సంస్థ కార్యాలయం ముందు గురువారం కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు అమాయకులపై దాడులు చేయడం దారుణమని అన్నారు. సుమారు 28 మందిని కాల్చి చంపడం ఎంతో బాధను కలిగించింది అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, నరసింహ ఆచారి, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, మేనేజర్ హాసీమ్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## కూటమి ఏడాది పాలన అస్తవ్యస్తం

– సీపీఎం మాజీ పార్లమెంట్ సభ్యులు పి.మధు



**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** మరో మాసం గడిస్తే ఏడాది పూర్తి చేసుకోనున్న కూటమి పాలన అస్తవ్యస్తంగా తయారైందని అవినీతి, ఆశ్రితపక్ష పాతం రాజ్యమేలుతున్నాయని సీపీఎం సీనియర్ నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువార ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళీతో పాటు కలిసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రజలకు అరిచేతిలో స్వర్గం చూపిస్తోందన్నారు. ఇసుక మద్యం, మైనింగ్, విద్యుత్ తదితర రంగాలలో అవినీతి దందాలు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువైయ్యారని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని విమర్శలు చేశారు. కాశ్మీర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## జాతీయ సంస్కృత వర్సిటీలో ఔషధ వనం ప్రారంభం



**తిరుపతి విద్య, ఏప్రిల్ 24 ప్రభాత వార్త** జాతీయ సంస్కృత వర్సిటీలోని హెల్త్ సెంటర్ ప్రాంగణంలో ఔషధ వనాన్ని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీలో దాదాపు 70 రకాల ఔషధ మొక్కలను వాటి నామకరణంతో నాటడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మానవ ఆరోగ్య సంరక్షణలో భాగమైన పలు రకాల ఔషధ మొక్కలను సేకరించి గార్డెన్ లో ఉంచడం జరుగుతుందన్నారు. ఔషద వనం అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయుర్వేదిక్ కన్సల్టెంట్ డాక్టర్ చిరంజీవి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలదత్తాత్రేయ,డాక్టర్ శ్వేత,హెల్త్ సెంటర్ బృందాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

## సంస్కృత వర్సిటీలో రక్తదాన శిబిరం



**తిరుపతి విద్య, ఏప్రిల్ 24 ప్రభాత వార్త**

జాతీయ సంస్కృత వర్సిటీలో ఆరోగ్య సంరక్షణ చర్యలలో భాగంగా హెల్త్ సెంటర్లో రుయాసుపత్రి సిబ్బంది సహకారంతో గురువారం రక్త దాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం ఒక గొప్ప కార్యక్రమమని,ప్రాణాలను కాపాడే క్రమంలో రక్తదాతలు ముందుకు రావాలని కోరారు. రక్తదాన శిభిరంలో 50మంది విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేయడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వర్సిటీ ఉద్యోగులు,విద్యార్థులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, డీన్ దక్షణ మూర్తి శర్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలదత్తాత్రేయ,రుయా సిబ్బంది,అధ్యాపకులు, ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మా స్కూల్‌ను బీపీఎస్‌గా పరిగణించండి సారూ...!

– డీఈవోకు తిమ్మినాయుడు

పాళ్యం గ్రామ పెద్దలు వినతి



**తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి తిరుపతి అర్బన్ మండలం తిమ్మినాయుడుపాళ్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తెప్పించుకున్నారు. మా పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు పిల్లలు బాగా చదువుకుంటున్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మా స్కూల్‌ను మూసివేసి వేరే ప్రాంతంలో (రోడ్డుకు) అటువైపును ఉండే పాఠశాలలకు వెళ్ళమని చెప్పడం దారుణం అన్నారు. అంతే కాకుండా చిన్న పిల్లలు రోడ్డును దాటుకుని వెళ్ళాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది అన్నారు. కావున గ్రామపెద్దలు, ఎస్ఎంసీ కమిటి ప్రకారం మా తిమ్మినాయుడు పాళ్యం గ్రామంలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉండాలని జిల్లా కలెక్టర్, డీఈవోను కోరి, ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ పెద్దలు వినతి పత్రంఅందజేశారు.గ్రామపెద్దలు,యువత, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్ వంద శాతం ఉత్తీర్ణత :హెచ్‌ఎం శ్రీహరి



**యర్రావారిపాళ్యం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటుకున్నట్లు హెచ్‌ఎం టి.శ్రీహరి తెలిపారు. బుధవారం విడుదలైన పది ఫలితాలలో ఎం.జ్ఞాపిక 541, ఎస్.జ్యోష్ణ 533, అత్యుత్తమ మార్కులు సాధించినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత వంద శాతం చేరుకోవడం పట్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. హెచ్‌ఎం ఉపాధ్యాయులు జగదీష్ ప్రసాద్, సదాశివ రెడ్డి, బి.వి.రమణ, సి.అమర్‌నాద్, బి.ప్రభావతి, వి.విజయలక్ష్మి,హరినాధ్‌రెడ్డి,పి.సురేంద్రలతోపాటు విద్యార్థులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వరుని ఏకాదశి ఉత్సవం

**నారాయణవనం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :**



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం గురువారం ఏకాదశి ఉత్సవంతో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్‌లు శనై, భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, అర్చకులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో అవసరం :



**నారాయణవనం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :**పంచాయతీ రాజ్ వ్యవస్థ వల్ల గ్రామాల అభివృద్ధి ఎంతో జరుగుతు ందని ఎంపిడిఓ జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా అన్ని గ్రామాలకు విద్యుత్‌సౌకర్యం, సిమెంట్‌రోడ్లు, మంచినీటి సరఫరా, విద్య,ఆరోగ్య వంటి అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి శివశంకర్, ఎంపిడిఓ గుణశేఖర్, డిప్యూటీ డిఇఓ హెచ్ ప్రభాకర్‌రాజు, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, పంచాయతీ ఎఇ నరేష్, ఇఓ షణ్ముగం, కార్యదర్శులు కిషోర్‌కుమార్‌రాజు, సుజన, కార్యదర్శులు, నాయకులు మోహన్, కె సుధాబాబు, పొను న్నస్వామి, రమేష్, సొరకాయులు, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర మాదిగ



**రామచంద్రాపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర మాదిగ అన్నారు. గురువారం నెత్తకుప్పం మాదిగవాడలోని రేణుకమ్మ ఆలయంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించి, విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ జననేత మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం నిర్విరామంగా పోరాటం చేశారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో వర్గీకరణ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు నెల్లేపల్లి గురవయ్య,లక్ష్మయ్య, చెంగల్రాయులు, మునికృష్ణయ్య, భాస్కర్, మాదవరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సి.రామాపురం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, పంచా యతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులతో కలసి ఇందిరమ్మ, పారిశుధ్య కార్మికులను దుశ్శాలువలతో సన్మానించారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొట్టే నరశింహారెడ్డి, మునిరామిరెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, గిరిధర్ రెడ్డి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



## పదిలో గీతాంజలి స్కూల్ ప్రతిభ

**రామచంద్రాపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** రామచంద్రాపురంలోని గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పది ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. పది ఫలితాలపై రామచంద్రాపురంలో డైరెక్టర్ డాక్టర్ మాదవి మాట్లాడుతూ విఆర్ శ్రావ్య 588 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాలలో చదువుతున్న 5 మంది విద్యార్థులకు 580, 13మంది 550 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

## మాలల ఆత్మీయ గౌరవ సభను విజయవంతం చేయండి



**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** పార్టీలకు అతీతంగా మాలల ఆత్మీయ గౌరవ సభను వచ్చేనెల మే 11న ఘనంగా నిర్వహించనున్నామని మాలల ఐక్యవేదిక నాయకులు మల్లారపు మధు తెలియజేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే నెల 11వ తేదిన తిరుపతిలోని మంగళం రోడ్డులోని ఆర్టీవో కార్యాలయ సమీపంలోని ఉన్న ఆశా కన్వన్షన్ హాల్ నందు సభ నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి మాల రాజకీయ నాయకులు, ఉద్యోగులు, మాల సంఘాల నాయకులు, యువత, మహిళ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘాలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సమావేశంలో దళిత నాయకులు దుగ్గాణి జయరాం, తాళ్ళపాక దాము, యనమల రాజేంద్ర, అశోకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమంను ప్రారంభించిన సుధారెడ్డి

**పాకాల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



పాకాల మండలంలోని దామలచెరువు, రమణయ్య గారి పల్లెలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం రోజున పులివర్తి సుధారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళల ఆర్థికంగా ఎదుగుదల మరియు మహిళల్లో చైతన్యం అత్యాధునిక సాంకేతికతను అంది పుచ్చుకొని ఆర్థికంగా స్వయం శక్తిగా ఎదగాలి అన్నారు. అందుకోసమే కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి నంగా పద్మజారెడ్డి, ఎంపీడీవో అరుణ, కృష్ణమనేని సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీమునివేలు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకున్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు ఆర్థిక సాయం

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

ఇంటర్ ఫలితాల్లో 981 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిన కీర్తికి పదివేలు ఉన్నత విద్యకు ప్రోత్సహించేందుకు తమవంతు సహాయంగా చిన్న పాలవేడు వాస్తవులు విశ్రాంత ఎస్పీ పి.రమేష్‌నాయుడు, సముద్రాల శేఖర్‌నాయుడు నగదు బహుమతి అందించగా, 9,77 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించిన సుష్మాకు 5 వేలు నగదు బహుమతి సముద్రాల రవినాయుడు నగదు బహుమతి మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యంసమక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు.

# పట్టాదారు పాస్ పుస్తకాలకు డబ్బులు అడిగారా?

- రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్



తడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడులో గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ రెవెన్యూ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతుల వద్దకు నేరుగా వెళ్లి ఆయన ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సు గ్రీవెన్స్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులతో మాట్లాడారు. సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, తడ తహశీల్దార్ శరత్‌బాబు, ఎంపిడిఓ విజయకుమార్, ఇతర అధికారులు ఎదురుగానే ఇద్దరు అన్నద మ్ములు చిలమత్తూరు నటరాజన్, సుందరంలతో పట్టాదారు పాస్‌పుస్తకం కోసం రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఇబ్బంది పెట్టారా అని, వారికి డబ్బులిచ్చారా అని ప్రశ్నించారు. దీంతో అక్కడ ఉన్న వారంతా అవాక్కయ్యారు. అయితే రైతులు తాము ఎటువంటి డబ్బులు చెల్లించలేదని చెప్పారు. కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వస్తున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. తడకండ్రిగ సర్పంచ్ తుమ్మా జయప్రద జిల్లా కలెక్టర్‌కు తమ గ్రామంలో సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ షెడ్, కూరగాయల మార్కెట్ కోసం ప్రభుత్వ స్థలం కావాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు.

# గూడూరు డివిజన్

## ఉగ్రవాదులు దాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ



బాలాయపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : కాశ్మీర్లోని పహల్గాం వద్ద టెర్రరిస్టుల పాశవిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన 27 మంది అమాయక హిందూ పర్యాటకుల ఆత్మ శాంతికై మండలం లోనినిండలి గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలు ఆవేదన చందిన మృతులకు ఆత్మశాంతి చేకూరాలని వారు కోరారు. గ్రామంలోని పురవీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని కోరారు.

## ప్రమాదాలకు నిలయంగా హోలీక్రాస్ సర్కిల్



సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని జాతీయ రహదారిపై గల హోలీక్రాస్ సర్కిల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. గురువారం జాతీయ రహదారిపై వరుసగా రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. దొరవారిసత్రం మండలం మోదుగులపాలెం నుంచి మోటార్‌బైక్‌పై వెళుతున్న మాయారి సురేంద్ర (32) అపాచీ బస్సు సడన్ బ్రేకు వేయడంతో దాని వెనుక వెళుతున్న మోటార్‌బైక్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుకనే వచ్చిన లారీ మోటార్‌బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే హోలీక్రాస్ జంక్షన్ వద్ద రోడ్డుపక్కన నిలబడి ఉన్న వేలూరు జ్ఞానమ్మను మోటార్‌బైక్‌పై రాంగ్‌రూట్లో వస్తున్న సాయినగర్‌కు చెందిన రసూల్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాల య్యాయి. మెరుగైన వైద్య చికిత్స కోసం రసూల్‌ను తిరుపతికి తరలించారు. జ్ఞానమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించి పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు. హోలీక్రాస్ జంక్షన్ వద్ద ప్రమాదాలను అరికట్టడానికి పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## యువ ఇంజినీర్లు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

- ఎన్‌బికెఆర్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పిలుపు



కోట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : యువ ఇంజినీర్లు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సిఎస్‌సి విభాగంలో టెక్‌వ్యూహ 2కె25 జాతీయ సాంకేతిక సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సదస్సును ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి అవసరమైన ఆవిష్కరణల వైపు భావి ఇంజినీర్లు ఆలోచించాలని కోరారు. సాంకేతిక నైపుణ్యాలను అన్వేషించడానికి వినూత్న ఆలోచనలు చేయాలని కోరారు. సాంకేతిక పరిశోధన ఆవిష్కరణలో ఇంజినీర్ల పాత్రను విశదీకరించారు. అనంతరం పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, వెబ్ పోటీ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, స్పాట్ ఈవెంట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎ.నారాయణరావు, టెక్‌వ్యూహ 2కె 25 కన్వీనర్ డాక్టర్ జి.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిఎస్‌సి విభాగంలో విద్యార్థులు వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## జీవో నెంబర్ 35తో అన్యాయం జరుగుతోంది



వెంకటగిరి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీవో నెంబర్ 35 నిరసనగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిపి తనుజా రెడ్డి, ఎంపిడీవో కోటేశ్వరరావు సిబ్బంది నిరసన తెలిపారు. ప్రభుత్వం కొత్తగా విడుదల జీవోలు ఈవోపీఆర్డీలకు 60శాతం, ఏ వాళ్లకు 30శాతం ఎంపిడీవోలుగా పదోన్నతులు కల్పిస్తున్నందుకు అన్యాయం జరుగుతున్నట్లు చెప్పారు. ఏవోలకు 50 శాతం, ఈఓపి ఆర్‌డిలకు 50 శాతం ఎంపిడీవోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈవోపీ ఆర్డీల పేరును డిప్యూటీ ఎంపిడీవోలుగా మార్చి ఏట పేర్లు డిప్యూటీ ఎంపిడీవోలుగా మార్చక పోవడం అన్యాయం అన్నారు. వెంటనే కొత్తగా విడుదల చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని కోరారు.

## ఇన్చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్వర్లు

బాలాయపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ఇన్చార్జి ఎంపీడీవోగా కె.వెంకటేశ్వర్లు నియమిస్తూ జడ్పీ సీఈఓఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ మూడు రోజులు సెలవు పెట్టడంతో ఇన్చార్జి ఎండిఓగా వెంకటేశ్వర్లు జడ్పీ సీఈఓ నియమించారు.

## ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు : ఎంఈఓ

బాలాయపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి త్వరలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 54 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు వివరించారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశం మేరకు ఫెయిల్ అయిన విద్యార్థులకు పాఠశాలల్లోనేప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం మధ్యాహ్నం రెండు పూటలా తరగతులు ఉంటాయని భోజనం వసతి కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి శ్రీధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు



తడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండలం వాటంబేడుకుప్పంలో వెలసిన శ్రీద్రౌపతి సమేత ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జాలర్ల కుప్పాల వారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు మహా కుంభా భిషేకం, ధ్వజారోహణంతో పాటు మహాభారత పఠనం ఉంటుంది. భారతంలోని ఆదిపర్వం, సభాపర్వంలను చదివి వినిపిస్తారు. రాత్రి గ్రామోత్సవం కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని వాటంబేడుకుప్పం గ్రామపెద్దలు తెలిపారు. వచ్చే నెల 5 వరకు ఈ ఉత్సవాలను తెలుగు, తమిళ సంప్రదాయాలతో నిర్వహించనున్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



కోట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండలంలోని కోట, విద్యానగర్ ప్రాంతాల్లో గురువారం ఎస్ఐ పవన్ కుమార్ తమ సిబ్బందితో పలు వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలపై వెళుతూ హెల్మెట్ లేని వారిపై కేసులు నమోదు చేశారు. కార్లలో ప్రయాణిస్తూ సీటు బెల్టు ధరించని వారిపై కూడా కేసులు నమోదు చేశారు. ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ వాహనాలకు సరయిన పత్రాలు లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి వాహనదారుడు తన వద్ద ఒరిజినల్ లైసెన్సులు ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు రవాణా నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

## షార్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు



శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 24 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో గురువారం బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎంఆర్ కురుప్పు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సుధాకర్ నాయక్ హాజరయ్యారు. ముంబాయిలోని ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ అయిన నాయక్ తన ఉపన్యాసంలో అంతరిక్షంలో ఇండియా అభివృద్ధి అనే అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, పలువురు డిప్యూటీ డైరెక్టర్లు, సేవాసంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో ఎన్‌బికెఆర్ విద్యార్థుల ర్యాలీ



కోట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం సాయంత్రం కోట మండలం విద్యానగర్ లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరా వృతం కాకుండా కేంద్రప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ చింతా రవీంద్రారెడ్డి, ఎన్‌సిసి ఆర్మీ అధికారులు మాధవయ్య, మల్లికార్జునరెడ్డి, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో పంచాయతీరాజ్ దినోత్సవం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షులు అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించి మండల పరిషత్‌లో పనిచేసే వివిధ రంగాల్లోని ఎపిఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి పాటుపడే పంచాయతీ కార్యదర్శులను, ఇతర రంగాలకు చెందిన వివిధ శాఖల అధికారులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీకృష్ణ, ఎపిఓ లక్ష్మీనారాయణ, ఎఇ పిఆర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి : ఎంపిపి



గూడూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : గ్రామాల్లో వేసవికాలంలో దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రజాప్రతినిధులు త్రాగునీటి సమస్య ఎక్కడ ఇబ్బంద లేకుండా చూడాలని గూడూరుఎంపీపీ బుదురు గురవయ్య అన్నారు. గురువారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజాప్రతిధు లతో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రాథమిక సమస్య ఎక్కువగా ఉందని అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ కార్యాలయంలో ప్రజలను క్యాష్ సర్టిఫికెట్లకి పొలాలకు సంబంధించిన చేర్పులు మార్పులు విషయంలో అధికారులు కాలయాపన చేస్తూ కార్యాలంట తిప్పుకుంటూ నారు ఇలాంటి విషయంలో అధికారులు సత్వరం స్పందించి పనులు చేయాలన్నారు. పలు శాఖల అధికారులు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూదూరు గురవయ్య, ఎంపిడీవో ఏ మధుసూదన్ రావు, వైస్ ఎంపీపీలు. ఎం. శ్రీనివాసులు రెడ్డి, వై. ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎంని కలిసిన కౌన్సిలర్లు



వెంకటగిరి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో కౌన్సిలర్లు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిశారు. చైర్పర్సన్ నక్క భానుప్రియపై పెట్టిన అవిశ్వాస తీర్మానం విగిపోవడంతో కౌన్సిలర్ల అందర్నీ నేదురు మల్లి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డితో బెటి చేయించారు. కౌన్సిలర్లు అందరూ టిడిపి ఒత్తిళ్లకు లొంగకుండా వైసిపి వైపే నిలబడ్డారని రాంకుమార్‌రెడ్డి వివరించారు. చైర్ పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్మన్ ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు,డాక్టర్ మస్తాన్ యాదవులు జగన్మోహన్ రెడ్డిని కలిశారు.

## పకడ్బందీగా విధుల నిర్వహణ

- గుడిపాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ మణికంఠ



గుడిపాల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: అంతర్‌రాష్ట్ర సరిహద్దు పోలీస్‌స్టేషన్ అయిన గుడిపాల పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ మణికంఠ చందోలు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించిన ఎస్పీ మణికంఠ చందోలు అంతర్‌రాష్ట్ర పోలీస్ స్టేషన్ అయిన గుడిపాల పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం భారీ వాహనాల రాకపోకలు వుంటాయని, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల రవాణా వంటివి గుర్తించి పక్కాగా చర్యలు తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులో స్టేషన్ వుండటంతో ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా వుంచాలని, అనుమానస్పదంగా కన్పించిన ప్రతి వ్యక్తిని తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే అంతర్‌రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన 14 సిసి కెమెరాల పనితీరును ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ సమీక్షించి బ్లాక్ స్పాట్స్‌ను సందర్శించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను తనిఖీ చేసిన ఎస్పీ పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసులు శక్తి యాప్ ప్రాధాన్యతను ప్రతి మహిళలకు వివరించి ప్రతి మహిళ మొబైల్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనని, ఆ నమ్మకంను పోలీసులు వమ్ము చేయకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ స్టేషన్ తనిఖీల్లో ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

**సిఎంసి ఆసుపత్రి సందర్శన :**

చీలాపల్లి సిఎంసి ఆసుపత్రిని ఎస్పీ మణికంఠ చందోలు గురువారం సందర్శించారు. సిఎంసి వైద్యాధికారులతో ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పోలీసు శాఖ ఎల్లప్పుడు సహకారం అందిస్తోందని ఈ సందర్భంగా ఎస్పీ సిఎంసి ఆసుపత్రి వైద్యాధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలు దేశానికి ప్రగతి



వాకాడు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : గ్రామ పంచాయతీలు దేశానికి ప్రగతి అభివృద్ధి అని ఎంపిడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రమైన వాకాడు మండల పరిషత్ కార్యాలయంలోని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలోని జాతీయ నాయకుల చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పల్లె ప్రగతి దేశానికి ప్రగతి, అభివృద్ధిని ప్రజాస్వామ్యంలో పంచాయతీలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరు గ్రామపంచాయతీ సర్పంచి దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డిని చాలువతో సత్కరించి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కొడవలూరు దామోదర్‌రెడ్డి మాట్లా డుతూ పంచాయతీ రాజ్ దినోత్సవం కార్యక్రమం గురించి పలు అంశాలను ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి

-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ అన్నారు. గురువారం స్థానిక మునిసిపాలిటీలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మహిళలు డబ్బు సంపాదించి వారి సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశ్యంతో కుట్టు శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని తెలిపారు. తొంభై రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితే వారి కుటుంబం తద్వారా సమాజం బాగుంటుందనే అభిప్రాయంతో చంద్రబాబునాయుడు మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు పెద్ద పీట వేశారని తెలిపారు. మహిళలు స్వయం శక్తితో ఎదగాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మంజునాథ్ గౌడ్, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, నాయకులు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్. ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు కేటాయించడంపై న్యాయ పోరాటం చేస్తాం



బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది కార్పొరేషన్ రుణాలు సంక్షేమ పథకాలు నాయకులు కేటాయిం చాలంటూ అధికారులపై దేశం నాయ కులు బెదిరింపులకు పాల్పడడం అన్యాయమని దీనిపై న్యాయ పోరాటం చేస్తామని ఎంపీడీవో తివిక్రమరావుకి ఎంపీపీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు నీర్పకోట సర్పంచ్ అరణి, విద్యానాథ్‌రెడ్డి, పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న కార్పొరేషన్ రుణాలు, సంక్షేమ పథకాలు పార్టీలు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి పొందే వారన్నారు. కానీ నేడు మండలంలోని తెలుగుదేశం నాయకులు తీరు తేడాగా ఉందన్నారు. తెలుగుదేశం నాయకులకే కార్యకర్తలకు కార్పొరేషన్ రుణాలు, ప్రభుత్వం అందించే పథకాలు తెలుగుదేశం నాయకులకు మాత్రమే కేటాయించాలని అధికారులను ఆదేశించడం అన్యాయమన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ స్కూలు సమీపం నుంచి ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్డు మరామ్మతులను కూడా ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టడం ఎంత వరకు సమంజసం అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజా, కాటూరు ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్ రవి, భాస్కరయ్య, శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, బాలాజీ, గిరిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు



రేణిగుంట,ఏప్రిల్ 24 ప్రభాతవార్త: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు లభించింది. జమ్మూ కాశ్మీర్ పెహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్ రావు పార్థివ దేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో విశాఖపట్నం వెళ్లారు. ఆయనకు వీడ్కోలు పలికిన వారిలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రవి మనోహర్‌చారి, రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, రాష్ట్ర జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జ్ కోట వినుత, జనసేన నాయకులు కోట చంద్రబాబు తదితరులు ఉన్నారు.

## తొట్టంబేడు ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా లత

తొట్టంబేడు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : అవినీతికి నిలయమైన తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాయంలో ఈనెల 16వ తేదీన ఎంఎల్‌ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్‌కు వార్నింగ్ ఇచ్చిన విషయం విదితమే. పైసలు లేకపోతే ఈ కార్యాలయంలో ఒక్క పని కూడా జరగదని జగమెరిగిన సత్యం. అన్ని రికార్డులు ఉన్నా ఇక్కడ ఒదళారితో నగదు వసూళ్ల కార్యక్రమం చేపడుతున్నారని తెలుసుకున్న ఎంఎల్‌ఏ వెంటనే అక్కడకు చేరుకోవడంతో సబ్‌రిజిస్ట్రార్‌తో సహా కార్యాలయ సిబ్బంది నివ్వెరపోయారు. ఒరైతుకు సంబంధించి మార్టిగేట్ చేసిన దాన్ని విడిపించు కోవడానికి కార్యాలయం చుట్టు తిప్పుతుండడంతో ఆయన నేరుగా ఎంఎల్‌ఏకు తెలియజేయడంతో సాక్షాత్తు బొజ్జలసుధీర్‌రెడ్డి కార్యాలయానికి చేరుకుని సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీశారు. అసలు ఇక్కడి కార్యాలయంలో ఏం జరుగుతోంది తనపేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని పిర్యాదులు వస్తున్నాయని తెలుసుకున్న ఆయన వెంటనే రెవెన్యూ మంత్రికి, కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. దీంతో ఏప్రిల్ 17వ తేదీ నుంచి సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ సెలవుపెట్టి వెళ్ళిపోయారు. దీంతో ఇక్కడ ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ వేనాలిలతను నియమించారు.

## హత్యకేసులో జీవిత కారాగారశిక్ష: రూ.15వేలు జరిమాన

శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త : నియోజకవర్గం ఏర్పేడు మండలం మునలిపేడులో 2017మే 11న జరిగిన హత్యకేసులో గురువారం తీర్పు వెలువడింది. నిందితులకు న్యాయస్థానం జీవిత కారాగార శిక్షతో పాటు రూ.15వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పిందని సిఐ జయచంద్ర విలేకరులకు వివరించారు. ఆయన అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మునలిపేడు గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య ఆస్తి తగాదా చోటు చేసుకుంది. ఈ నేపధ్యంలో ముద్దాయిలు సుజాత,ఆమె తల్లి రాణెమ్మ, సుజాత భర్త వవెంకటేశ్వరులు కలసి సుజాత అన్నసుబ్రమణ్యం భార్య సుబ్బమ్మను చంపారు.హత్యకు గురైన సుబ్బమ్మ కుమారుడు జగ్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటిలో ఎస్ఐ ఎం.వెంకటరమణ కేసు నుమోదు చేసారు. ఐపిసి 302,109,సెక్షన్ల కింద కేసునమోదు చేసారు. రేణిగుంట రూరల్ సిఐ జి.మురళీధర్ సాధిక్ అలి దర్యాప్తు చేసారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ప్రస్తుతం ఉన్న సిఐ జయచంద్ర పర్యవేక్షణలో సాగుతున్న కేసులో గురువారం కోర్టులో సాక్ష్యాలను విచారించిన శ్రీకాళహస్తి 12 వ అడిషనల్ జిల్లా జడ్జి శ్రీనివాసులు నాయక్ ముగ్గురు ముద్దాయిలకు జీవిత కాల కారాగార శిక్ష మరియు ఒక్కొక్కరికి రూ.15వేల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారని సిఐ జయచంద్ర వివరించారు.

## క్రిస్ సిటీ పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్



కోట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండలం కొత్తపట్నం పంచాయతీలోని జరుగుతున్న క్రిస్ సిటీ పనులను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేన గురువారం పరిశీలించారు ఈ పనులను వేగవంతం చేయాలని సూచించారు ఆయన వెంట తహశీల్దార్ కె.జయ జయ రావు మండల సర్వేర్ గోపీనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు

## పజలకు మౌలిక వసతులు కల్పించండి : ఎంపిడిఓ



నాయుడుపేట ఏప్రిల్ 24 ప్రభాతవార్త : గ్రామాల్లో నివాసం ఉండే ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించే విదంగా అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఓ సురేష్ బాబు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీరాజ్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర ్భంగా ఎంపిడిఓ సురేష్‌బాబు మాట్లడుతూ గ్రామపంచాయితీల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ సౌకర్యం, సిసిరోడ్లు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అసవే వేసవికాలం కావడంతో గ్రామాల్లో తాగునీరు సమస్యలు తలెత్తక ముందే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేసి అభివృద్ధి చేయాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ రాజేంద్ర, పశుసంవర్ధకశాఖ ఎడి గోవర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శిలు, గోపాల్, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు,పి.హెచ్.సిలను సందర్శించిన కలెక్టర్

దొరవారిసత్రం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలో గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పర్యటించడం జరిగింది. ఈ పర్యటనలో భాగంగా దొరవారిసత్రం మండల పరిధిలోని పి.హెచ్.సిని సందర్శించి అక్కడి వసతులను, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమం ఎస్సీ బాలికలు,వసతి గృహములను సందర్శించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పన కూడా చాలా అవసరమని అందుకు తగ్గట్టుగా ఎస్సీ,బిసి వసతి గృహంలోని అవసరమైన మరమతులకు సంబంధించిన పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం తాహసిల్దారు శైలకుమారి,ఎంపిడిఓ గోవర్ధన్,ఎసై అజయ్ కుమార్,ఆర్ డి ఓ కిరణ్మయి,వివిద శాఖల అధికారులు,నాయకులు పాల్గొన్నారు.